ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం

- జీడుగా మారిన సీజీ ప్రాజెక్టు ఆయకట్టు భూములు
- పూడిపోయిన కాలువలు
- కాలువల నిండా కంప చెట్లు, పిచ్చి మొక్కలే

తనకల్లు: మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీ ప్రాజెక్టు) ఆయకట్టు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు పూడిపోవడంతో పాటు కాలువల నిండా కంపచెట్లు, పిచ్చి మొక్కలు నిండిపోయాయి. కాలువల్లో నీరు ముందుకు రాక ఆయకట్టు భూముల్లో పంటలను సాగు చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఆరు దశాబ్దాల క్రితం 170 ఎంసీఎఫ్టీ నీటి సామర్థ్యంతో సీజీ ప్రాజెక్టును నిర్మించారు. మండలంలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన సీజీ ప్రాజెక్టు కుడి కాలువ కింద 600 ఎకరాలు, ఎడమ కాలువ కింద మరో 300 ఎకరాలు కలిపి మొత్తం 900 ఎకరాలు ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రాజెక్టులో నీరుంటే పరోక్షంగా మరో 2,000 ఎకరాలు సాగులోకి వస్తాయి. వరి, మొక్కజొన్న, టమాట తదితర పంటలను ప్రధానంగా రైతులు పండిస్తారు. అయితే ప్రాజెక్టు కాలువలు పూడిపోవడం, మరమ్మతులకు గురికావడం, ముళ్ల కంపలతో నిండిపోవడం వల్ల ప్రాజెక్టులో నీరున్నా ఆయకట్టు సాగుకు ఉపయోగపడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆయకట్టు భూములు ఎందుకు పనికిరాకుండా పోయి బీడు భూములుగా మారిపోయాయని చెబుతున్నారు. అలాగే ప్రాజెక్టు వద్ద వరద నీరు వెళ్లడానికి నిర్మించిన ప్రహరీ కూడా కూలి సంవత్సరాలు గడుస్తున్నాయి. ఇంతవరకు తిరిగి నిర్మించలేదు. సీజీ ప్రాజెక్టు రెండు కాలువల్లో పేరుకుపోయిన పూడికతో పాటు ముళ్ల పొదలను తొలగిస్తే ఆయకట్టు భూములకు నీరు అందుతుంది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయిందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలువల పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టి ఆయకట్టు భూములు సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సీజీ ప్రాజెక్టు


ముళ్లపొదలతో పూడిపోయిన ప్రాజెక్టు కాలువ

పంటలు పెట్టి చాలా కాలమైంది



సీజీ ప్రాజెక్టు కింద నాకు మూడు ఎకరాలు పొలం ఉంది. గతంలో వరి పంట సాగు చేసేవాళ్లం. అయితే కాలువలు పూడిపోయాయి. పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో నీరు రావడం లేదు. దీంతో పంటలు సాగు చేయడం మానేశాం. మా పొలాలన్నీ బీడుగా ఉన్నాయి.

– నరసింహులు, ఆయకట్టు రైతు, సీజీ ప్రాజెక్టు

పూడికతీత పనులు చేపట్టాలి



సీజీ ప్రాజెక్టు కాలువలను శుభ్రం చేసి, మరమ్మత్తు పనులు చేపట్టాలి. దీని వల్ల ఆయకట్టు రైతులతో పాటు సీజీ ప్రాజెక్టు, ఎంసీ తండా, ఎగువతొట్టి పల్లి, తవళం తదితర గ్రామాల రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సమస్యను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే పనులను ప్రారంభించాలి.

– జయకుమార్ నాయక్, రైతు, ఎంసీ తండా

ప్రతిపాదనలు పంపించాం



సీజీ ప్రాజెక్టు కాలువలు, గేట్లు మరమ్మతుల కోసం రూ.42 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కూలిన గోడ నిర్మాణం కోసం రూ.80 లక్షలు ఖర్చు అవుతుందని గతంలోనే అధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే పనులను ప్రారంభిస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.బయప్ప, ఇరిగేషన్ ఏఈ, తనకల్లు

క్లుప్తంగా

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి


మొక్క నాటుతున్న డ్వామా పీడీ విజయ్ ప్రసాద్

తాడిమర్రి: మండల పరిధిలోని నిడిగల్లు గ్రామంలో శనివారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా డ్వామా పీడీ విజయ్ ప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలు హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండ్ల తోటలు మంజూరైన రైతులు త్వరితగతిన మొక్కలు నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్ కుమార్‌రెడ్డి, టీఏ, ప్లాంటేషన సూపర్‌వైజర్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

ధర్మవరం అర్బన్: అరుణాచలం గిరి ప్రదర్శనకు ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు సదుపాయం కల్పించామని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీన పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 18న ఉదయం 6 గంటలకు ధర్మవరం డిపో నుంచి బస్సు బయలుదేరి వెళుతుందని పేర్కొన్నారు. రానుపోను చార్జీ రూ.1,400 నిర్ణయించామన్నారు. భక్తులు ముందుగానే ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6303151302, 9959225859 నంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి పంచాయతీలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం బోర్లకు 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ ఆదినారాయణ తెలిపారు. శనివారం భూమిపూజ చేసి విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమేష్, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

తనకల్లు: మండలంలోని కనసానివారిపల్లి వద్ద వెలసిన ధనకొండ గంగమ్మ ఆలయంలో శనివారం చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. కొందరు ఆగంతకులు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీని పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఆలయాభివృద్ధికి విరాళాలు అందజేసిన కొందరి దాతల పేర్లను సైతం తొలగించడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ ప్రారంభం


టాస్ వేసి క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, కృష్ణానాయక్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాసులు, తాహెర్‌వలీ, సురేంద్ర తదితరులు తెలిపారు. ఇలాంటి టోర్నీ నిర్వహించడం వల్ల ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వ వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. తొలి మ్యాచ్‌లో ముదిగుబ్బ జట్టుపై గాండ్లపెంట జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో నల్లచెరువు జట్టుపై ఓడీసీ జట్టు గెలుపొందింది.

బాగా చదువుకోండి


కంప్యూటర్, లైబ్రరీ రూమ్‌లను ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

ధర్మవరం: పట్టణంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం సాయంత్రం కంప్యూటర్, లైబ్రరీ రూమ్‌లను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, డోనర్ ప్రేమ్ ప్రారంభించారు. విద్యార్థులు స్పోర్ట్స్ సెంటర్‌లోని కంప్యూటర్లతో పాటు లైబ్రరీలోని పుస్తకాలతో బాగా చదువుకోవాలన్నారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బత్తలపల్లి రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ధర్మవరం ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు, దాతలు పాల్గొన్నారు.

'మత్తు'కు బానిసలు కావొద్దు


మాట్లాడుతున్న క్రైస్తవ మత బోధకుడు సురేంద్రన్ జేసుదాస్

కదిరి: 'మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దు'అని అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు సురేంద్రన్ జేసుదాస్ పేర్కొన్నారు. స్థానిక సియోన్ బ్లెస్సింగ్ చర్చిలో శనివారం జరిగిన సువార్త స్వస్థత పరిశుద్ధాత్మ ఉజ్జీవ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన ఆంగ్ల ప్రసంగాన్ని చర్చి పాస్టర్ టి.ఎమ్.విద్యాసాగర్ తెలుగులో అనువాదం చేశారు. చెడు వ్యసనాలు ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితులను పాడు చేస్తాయన్నారు. ముఖ్యంగా యువత వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. సహోద్యోగులు, స్నేహితులు ఇలా ఎవరి గురించి కూడా వ్యర్థమైన మాటలు చెప్పడం అంత మంచిది కాదని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ పాపములను వీడి క్రీస్తువలె పవిత్రంగా జీవించడం అలవరుచుకోవాలన్నారు. మనం చేసిన పాపాలను దేవుని ఎదుట ఒప్పుకోవడానికి ఏమాత్రం సంకోచించరాదని పేర్కొన్నారు. అప్పుడే దేవుడు మనల్ని క్షమిస్తాడని తెలిపారు. క్రైస్తవులు ప్రతి ఆదివారం చర్చికి వెళ్లినప్పుడు అక్కడ చెప్పే దేవుని వాక్యంపై మనసు కేంద్రీకరించాలే గానీ తోటి వారితో పనికిమాలిన ప్రసంగాలు చేయడం మంచిది కాదన్నారు. క్రీస్తు మహిమలను ఘన పరుస్తూ అంతర్జాతీయ సువార్తకులు చేసిన ప్రసంగం హాజరైన వారందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సువార్త స్వస్థత పరిశుద్ధాత్మ ఉజ్జీవ సభలకు కదిరి, పరిసర మండలాల నుంచి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జిల్లాస్థాయి చెస్ టోర్నీకి స్పందన


చెస్ పోటీల్లో తలపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: జిల్లాస్థాయి చెస్ టోర్నీకి అనూహ్య స్పందన వచ్చిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి చెస్ టోర్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. నేడు యూటీఎఫ్ లక్ష మందికి పైగా సభ్యత్వమున్న ఏకైక సంఘమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందంజలో ఉందని తెలిపారు. చెస్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 36 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకుడు నారాయణ స్వామి, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, నాయకులు క్రిష్టప్ప, సాయి గణేష్, రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, హరిశంకర్, ఆంజనేయులు, అమర్ నారాయణ రెడ్డి, ఆదిరెడ్డి, నాగేంద్ర కుమార్, సాయినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, జయరాములు, ఈశ్వరయ్య, రామ్మోహన్, బాబయ్య, దుర్గా, సీతారత్నం, సబిహాభాను, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..


కదిరి: ఖాద్రీశుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఖాద్రీశుడి ఆలయంలో దీపాలు పెడుతున్న మహిళలు


గాండ్లపెంట: వేపరాల ఆలయంలో అన్నదాన కార్యక్రమం


పోట్లమర్రి ఆంజనేయ స్వామికి ఆకుపూజతో అలంకరణ


తనకల్లు: అలంకరణలో ఆంజనేయుడు


తలుపుల: ఆంజనేయుడికి పూజలు చేస్తున్న భక్తులు

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు కొమండూరు మారుతిప్రసాద్, సాయికృష్ణ ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు పలు ఆలయాల వద్ద నాగుల కట్టకు పాలు పోశారు. పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించి భజనలు చేశారు. మాంసాహారం ముట్టకుండా పూజా కార్యక్రమాల్లో మునిగిపోయారు. పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ మాసంలో ఆచరించే పూజలు, ఆరాధనలు, అర్చనలు, వ్రతాలు, జపాలు, హోమాలు సత్వరమే సిద్ధించడంతో పాటు దాని కత్రుఫలం చేసిన వారికి అందుతుందని భక్తుల విశ్వాసం.

శ్రావణమాస సందడి

నల్లమాడ: శ్రావణమాసం మొదటి శనివారం మండలంలోని పెద్దకోట్లపల్లి, రెడ్డిపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తుల దర్శనం కోసం ఆయా ఆలయాల్లో పూజారులు రాజగోపాల్, ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు విచ్చేసి ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

గాండ్లపెంట: మండలంలో శ్రావణమాసం మొదటి శనివారం పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మునగలవారిపల్లి, గాండ్లపెంట, వేపరాల, బొలిగుట్లపల్లి, నీరుకుంట్లపల్లి, మలమీదపల్లి, రెక్కమాను తదితర గ్రామాల్లో స్వామిని దర్శించుకున్నారు. వేపరాల గ్రామంలో భక్తులకు తాళ్లకాల్వ గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఖాద్రీశుడి ఆలయంలో..

కదిరి టౌన్: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

తనకల్లు: మండలంలోని తవళం ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం శ్రావణమాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి ఆంజనేయుడిని దర్శించుకున్నారు.

ఆంజనేయుడికి పూజలు..

తలుపుల: శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఓబీఆర్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు గోపీనాథ్ ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేశారు. పూజల అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


ముదిగుబ్బ: వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ 32 మంది మహిళలు సామూహికంగా వ్రతాన్ని ఆచరించారు. వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు రాజేష్ వివిధ రకాల పూలు, తులసీ ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హరిహర దేవాలయంలో..

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని హరిహర దేవాలయంలో శనివారం అర్చకుడు రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో ఏడు శనివారాల వ్రతం నిర్వహించారు. మహిళలు పసుపు దుస్తులు ధరించి పూజల్లో పాల్గొన్నారు. విష్ణు సహస్ర నామ పరాయణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


సరుకులు అందజేస్తున్న మిత్ర బృందం

కనగానపల్లి: కష్టాల్లో ఉన్న స్నేహితుని కుటుంబానికి చేయూతనందించారు. కనగానపల్లికి చెందిన సాకే నాగేంద్ర ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు దిక్కులేనివారయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న నాగేంద్ర బాల్య మిత్రులు బట్టా రాజేష్ ఆధ్వర్యంలో శనివారం స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేల నగదు, బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు, పిల్లలకు అవసరమైన వస్తువులు, తినుబండారాలు అందించారు. బోయపాటి శ్రీకాంత్, అంకె హరి, బట్టా శివ, పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ


సేంద్రియ ఎరువు తయారు చేయిస్తున్న టింబక్టు సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై రైతులకు టింబక్టు కలెక్టివ్ సంస్థ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. కనుముక్కల గ్రామంలో శనివారం సేంద్రియ వ్యవసాయం కో ఆర్డినేటర్ సన్నప్పయ్య ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కో ఆర్డినేటర్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వలన భూమి సారవంతాన్ని కోల్పోతుందన్నారు. రసాయన ఎరువుల ద్వారా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీంతో టింబక్టు కలెక్టివ్ సంస్థ సేంద్రియ ఎరువుల ద్వారా పంటలను పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం భూసారాన్ని పెంచే పంచగవ్య, జీవామృతం, ఘన జీవామృతం, పుల్లటి మజ్జిగ కషాయాలు తయారు చేయించారు. అనంతరం రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ నీటి వాడకం పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు నారాయణస్వామి, ముత్యాలయ్య, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు హరినాథరెడ్డి, కల్పన పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ వార్షికోత్సవం


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యాయులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తాహిర్ వలీ, శ్రీనివాసులు, మైనుద్దీన్, మల్లికార్జున, ఆజంబాషా తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఆప్తులై..


మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: అనాథలు, ఆర్థిక స్తోమత లేని వారికి ఖిద్మత్-ఏ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి ఆత్మబంధువులుగా నిలుస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చిన వెంకటేశం (75) సత్యసాయి భక్తుడిగా కొద్ది సంవత్సరాలుగా పుట్టపర్తి పట్టణంలో గోపురం రోడ్డు థర్డ్ క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు బంధువులు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్-ఏ-ఖల్క్ సొసైటీ సభ్యులను ఆశ్రయించారు. కమిటీ సభ్యులు షామీర్, అలీ, చాంద్ సాకీర్, సాదిక్ వెంటనే స్పందించారు. పుట్టపర్తి పట్టణంలో కర్ణాటక నాగేపల్లి శ్మశాన వాటికలో వేంకటేశంకు వారి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ ప్రజలు, పెద్దలు ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

గాలీవానకు నేలకూలిన చెట్టు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పుట్టపర్తి టౌన్: మండల పరిధిలోని కప్పలబండ పంచాయతీ ఆర్వీ జానకీరాం కాలనీలో గురువారం గాలీవానకు చెట్టు నేలకూలింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చెట్టు కూలిపోయి మూడు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో పాటు మనుషులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాలనీవాసులు ఈ విషయాన్ని సర్పంచ్ చిన్న పెద్దన్న దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను కార్యదర్శి మనోహర్‌కు చెప్పాలని సూచించారు. కూలినది కంపల చెట్టు కావడంతో మనుషులతో తొలగించడానికి సాధ్యపడదని తెలిపారు. జేసీబీ సహాయంతో తొలగిస్తామని హామీ ఇచ్చారు.. అయితే ఇప్పటికీ తొలగించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.